# డియర్

## - ఇందూరమణ



మైడియర్ రమణా!

హౌ ఆర్యూ!? మన మదర్ లాండ్ ఇండియా విశేషాలేమిటి?! ఇక్కడంతా సుందర స్వప్నం. ఆనందమయ సాగరం ఈ నగరం. పారిస్ అంటే సౌందర్యం. శృంగారం. భూతల స్వర్గం. చాన్నాళ్ళుగా నీకు లెటర్ వ్రాయాలనుకుంటూనే నెగ్లెక్ట్ చేస్తున్నాను. ఒక్క క్షణం కూడా తీరికుండదనుకో!

నాతో పాటూ లండన్ బేబి ఉంటోంది. ఆ అమ్మాయి పేరు... ఎందుకులే?! అయినా, పేరుతో ప్రయోజనం ఏం వుంది?

ఆమె కూడా నాతో పాటే బయో కెమికల్ ఇంజనీరింగ్‌లో పరిశోధన చేస్తోంది.

మంచి అమ్మాయి!

మనమన్నా... ఇండియా అన్నా అమితమైన అభిమానం ఆ అమ్మాయికి.

అవునూ?!

స్వరాజ్యం ఎలా ఉంది?! కలుస్తోందా?

ఒరేయ్ రమణా!

మానవ జన్మ ఎత్తినవాడు ప్యారిస్ చూడకపోతే అతని జన్మ... జీవితం చరితార్థం కాదురా?!

ఎంత సుందర నగరమనుకున్నావ్?!

ఇండియాలో కంటే ఇక్కడ విపరీతమైన చలి. ఎంతలా మన శరీరాన్ని పరుపుల్లో కప్పకున్నా శరీరం వణుకుతూనే ఉంటుంది.

ఇక్కడ ఈఫిల్ టవర్... విక్టరీ గేట్... నెపోలియన్ టూంబ్ లాంటి చారిత్రాత్మకమైన ప్రాంతాలు చూసాను. మొన్నో రోజు రాత్రి ఆ అమ్మాయి బలవంతం మీద 'లీడో' సందర్శించటానికి వెళ్ళాం.

అవునూ?! 'లీడో' అంటే నీకర్థం కాలేదు కదూ!?

'లీడో' అని ప్రపంచ ప్రఖ్యాత హోటల్ పారిస్‌లో ఉంది. ఇందులో కళాత్మకమైన ఫ్రెంచి ప్రదర్శనలు జరుగుతూ ఉంటాయి.

అబ్బ!

హోటల్ ఎంత అద్భుతంగా ఉందో?! అంతకంటే వెయ్యిరెట్లు ఆ కళాఖండాలు ప్రదర్శకులను విపరీతంగా ఆకర్షిస్తున్నాయంటే నమ్ము!

నువ్వెవరికీ చెప్పనంటే - ఓ నిజం చెప్తాను!

ఆ అమ్మాయి, నేను ఓరోజు రాత్రి 'రెడ్‌లైట్ స్క్వేర్' ప్రాంతం చూడటానికి వెళ్ళాం. అక్కడ ఎంత తియ్యటి అనుభూతి అది.

ఆ క్షణం —

ఎన్నో... ఏవేవో గుర్తొచ్చాయిరా! కానీ, ఆ క్షణం- ఆ ఘడియ ముందు ఎవరూ... ఏవీ నాకు శాశ్వతం కాలేకపోయాయి.









23-3-90 ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక



ఆ అమ్మాయి —
అప్పుడప్పుడూ ఇండియా చూడాలంటోందిరా!
న్యూడ్ షోస్ (దిగంబర చిత్రాలు), బ్లూఫిలింస్ (బూతు సినిమాలు) విచక్షణ రహితంగా ప్రదర్శిస్తున్నారు.

అక్కడ ఆడా... మగా అనే తారతమ్యం గానీ, మీరూ... మేమూ అనే విచక్షతగానీ ఉండదు.

అదిగో —

అక్కడే... ఆ అమ్మాయి నా పెదవుల మీద గాఢంగా ముద్దు పెట్టుకుంది. నన్ను బలవంతంగా తన గుండెలకేసి అదుముకుంది.
నాకే ఇప్పట్లో రావటానికి మనస్సంగీకరించటం లేదు.

మన వాళ్ళందరి విశేషాల్తో ఉత్తరం వ్రాయి. అందర్నీ అడిగానని చెప్పు.

ఉంటాను.

యువర్స్ లవింగ్లీ
మధు.

ఉత్తరం మడిచి లేచాడు మధు.

ఆమె అంతవరకూ ఉత్తరం వ్రాస్తున్న మధూనే తదేకంగా చూస్తూ కూర్చుంది.

అప్రయత్నంగా ఆమెని చూసాడు మధు.

చిలిపిగా చూసి నవ్వింది ఆమె.

“మా మిత్రుడికి ఉత్తరం వ్రాసాను. పడేసి వస్తాను.” ఇంగ్లీషులోనే సమాధానం చెప్పాడు మధు.

“ఓ! అయామ్ సారీ! మీకీరోజు ఇండియా నుండి ఓ లెటర్ వచ్చింది. ఇవ్వడం మరిచాను.” ఆమె సమాధానంగా లేచి బుక్‌రేక్ దగ్గరకు పరుగెట్టింది.

మధూ కూడా ఆత్రంగా ఆమె వెనుకే వెళ్ళి లెటర్ ఆమె చేతిలో నుండి గబాలున తీసుకున్నాడు.

ఆమె ప్రేమగా అతని తల రెండుచేతుల్లోకీ తీసుకొని పెదవుల మీద గాఢంగా చుంబించింది.

ఆమెని సుతారంగా నెట్టి సోఫాలో కూర్చొని ఉత్తరం విప్పాడు మధు!

ఇండియా నుండి వచ్చిన ఉత్తరమంటే ఎవరు వ్రాసి ఉంటారు?! ఆలోచిస్తూనే ఉత్తరం వెంట దృష్టి సారించాడు మధు.

“మధుమూర్తి గారికి —

ఎవరా అని ఆశ్చర్యపోతున్నావ్ కదూ!

ఇండియా నుండి ఉత్తరం వచ్చిందేమిటా? అని ఆలోచనలో పడ్డావు కదూ!

అవున్లే!

పారిస్‌లో అడుగుపెట్టి సంవత్సరం అవుతున్నా — ఉన్నవూరు... కన్న తల్లి... ప్రాణమిత్రుడు... చివరికి స్వరాజ్యం కూడా నీకు గుర్తు రాలేదంటే... నీకసలు ఇండియా కూడా గుర్తుందో? లేదో? అని నేను ఇన్నాళ్ళూ ఉత్తరం వ్రాయడానికి సంశయించాను.

ఇప్పుడు —

ఆ అవసరం ఏర్పడింది కనుకే వ్రాస్తున్నాను.

నీకు మన వూరు గుర్తుంది కదూ!?!

మనం స్కూలుకు వెళ్తూ వుసిరికాయలు తెచ్చుకోవటానికి చెరువు గట్టుకు వెళ్ళేవాళ్ళం.

ఆ చెరువులో ఓసారి కలువపూల కోసం వెళ్ళిన మన స్కూలు పిల్లలు ఇద్దరు చెరువులో దిగి ఆ చెరువుకు బలైన ఉదంతం గుర్తుండే ఉంటుంది.

ఆ మాయదారి చెరువు... ఆ మహమ్మారి ఏం చేసిందో తెలుసా?

మొన్నో రోజు —

అర్ధరాత్రి!

ఉన్నట్టుండి గట్టు తెంచుకొని వూరు మీద పడింది. గొడ్డూ... గోదా, పిల్లా... జల్లా నిద్రమత్తు నుండి తేరుకోకముందే నీళ్ళపాలయ్యారు. ముసలివాళ్ళు చేయూత ఇచ్చే నాధులు లేక ప్రాణభయంతో అరచి అరచి అకాల మరణం పాలయ్యారు.

మీ నాన్నగారు ధాన్యం కుప్పకి కాపలాకోసం కళ్లంకి పోయి పడుకున్నారు. ఆయన కూడా నిద్రలోనే నీళ్ళవాత పడి కొట్టుకుపోయారు. చాకిరేవు బండల దగ్గర ఆయన శరీరం దొరికింది.

మా ఇల్లు నేలమట్టమయింది. మన స్కూలు రూపురేఖలు లేకుండా కొట్టుకుపోయింది.

ఒరేయ్ మధూ!

ఇవేవీ భయంకర సంఘటనలు కాదురా?! కానీ... కానీ... స్వరాజ్యం... స్వరాజ్యం బ్రతుకే అగమ్యమై పోయిందిరా?!

ప్రేమించి పెళ్ళాడతానని వాగ్దానం చేసిన నువ్వే పరాయి దేశం పారిపోయి పై చదువుల పేరుతో పరాయి వాడివై పోయావు.

కనీసం, సంవత్సరం కావస్తున్నా జ్ఞాపకానికి... తను గుర్తున్నదనే చిన్న నమ్మకానికి ఓ కార్డు ముక్క కూడా వ్రాయలేదు నువ్వు.

మాయదారి చెరువు గట్టు తెగిన మర్నాడే వూరు వూరంతా స్మశానవైరాగ్యంతో నిశ్శబ్దంగా ఉన్నప్పుడు... మరుగుకు పొలంవైపు వెళ్ళివస్తున్న స్వరాజ్యాన్ని... మన వాళ్ళే... మనవూరి వాళ్ళే... మన స్నేహితులే నీ గురించి అవహేళన చేసి... నువ్వు అనుభవించి వదిలిన కాగితం పువ్వనని గేలిచేసి మానభంగం చేసారట్రా ఆ దుర్మార్గులు!

ఇప్పుడా అమ్మాయి పరిస్థితి అగమ్యంగా ఉందిరా!

వూరి పరిస్థితే అయోమయంగా ఉంది!

ఆ మాయదారి చెరువే నిశ్చింతగా... నిశ్శబ్దంగా... నిశీధిలా... అచ్చం నీలాగే ఇహపరాలను మరచి రాక్షస మౌనం దాల్చిందిరా!

స్వరాజ్యమే స్వగతంలో కొట్టుమిట్టాడుతోంది.

ఏమౌతుందో? ఏమో?!

ఇప్పటికైనా నీకు ఇండియా... మన వూరు... సమాధయిన స్కూలు... పాడు చెరువు... చెరపబడ్డ స్వరాజ్యం... దగాపడ్డ నీవాళ్ళు... అందరూ గుర్తొస్తే? సంతోషం!

నీ అప్రియ మిత్రుడు
రమణ

